కథా నిలయం
శ్రీకాకుళం

# గాలిలో దీపాలు

బారులు తీర్చిన దీపాలు అమావాస్య రాత్రిని చూసి పరిహాసంగా నవ్వుతున్నాయి. చీకటి మూలమూలలకి జారిపోతోంది. ఊరిచివర రాతిగోడల పూరిఇంటిబయట గుమ్మం దగ్గరకూడా నాలుగు ప్రమిదలు వెలుగుతున్నాయి. అరుగుమీద కూర్చుని వసుంధర ఎదుటి మేడలో ధగద్ధగాయమానంగా వెలుగుతున్న విద్యుద్దీపాల వరుసలు తేరిపార చూస్తోంది. పాలరంగులో ఉన్న కిటికీ అద్దాలలోంచి దీపకాంతులు ప్రసరిస్తున్నాయి. గది కిటికీ అద్దంమీద ఒక నీడ—ఎదురుగా మరో నీడ సమీపిస్తోంది...తరవాత ఒకటే నీడ. వసుంధర శరీరం జలదరించింది.

ప్రియంవద ఎంత అదృష్టవంతురాలు! తనతోపాటే స్కూల్ ఫైనల్ చదువుతోంది. తనకంటే అందమైందికాదు.

కాని తనకంటే అదృష్టవంతురాలు, పెట్టిపుట్టింది. అన్ని విధాలా ఆదర్శవంతుడైన భర్తని సంపాదించుకుంది. విద్యాధికుడు, రూపసి, చాలా మంచివాడని కూడా ఆమే చెప్పింది. సుఖమయజీవితానికిహ ఆమెకి లోటేముంది? తనకికూడా...

రయ్‌మని గాలివీచింది. కిటికీ తలుపులు కొట్టుకున్నాయి. చప్పుడువిని వసుంధర ఆలోచనల్ని అరికట్టి, యథాలాపంగా దీపాలవైపు చూసింది. ప్రమిదల్లో జ్యోతులు ఆరిపోయాయి. వసుంధర మళ్లీ దీపాలు వెలిగించి తిరిగి అరుగుమీాద కూచుంది. మళ్ళీ ఆలోచనలు...

తనకికూడా ప్రియంవదకి కలిగిన అదృష్టం కలిగితే! వసుంధర నిమీాలితనేత్రాలతో ఊహాప్రపంచంలో విహరిస్తోంది.

"వసుంధరా !"

వసుంధర ఆ మృదువైన పిలుపు విన్నది. కాని పలకకూడదు. కొంచెం బెట్టు అవసరం.

"వసుంధరా !"

అప్పుడే వినిపించుకో కూడదు. వెనక్కి చూడకుండా, చూసినట్టు కనపడకుండా క్రీగంట చూ స్తే...

"రాణీ"

ముసిముసిగా నవ్వుకుంది.

"వసూ."

చిరునవ్వు వొలకబోస్తూ నాజూకుగా, ప్రబంధ నాయికలా కొద్దిగా పక్కకి తిరిగి కళ్ళెత్తి చూసింది. అతడు

సమీపించి చుబుకం స్పృశించాడు. అలా ఎన్ని క్షణాలైతే నేం! మేఘాల్లో పావురంలా—పావురాల జంటలా—తేలి పోతూ సాగిపోతుంటే...

టపటప కిటికీ తలుపులు కొట్టుకున్నాయి. వసుంధర ఉలిక్కిపడి చూసింది. ప్రమిదల్లో దీపాలు ఆరిపోయాయి. మధురభావనలు చెదిరిపోయాయి. ప్రబంధనాయిక వసుంధర తేజోవిహీనంగా దీపాలవంక చూసింది. బద్ధకంగా లేచి వాటిని మళ్లీ వెలిగించే ప్రయత్నంలో నిమగ్న అయింది. సుఖస్వప్నం చెదరి నిజం కఠినంగా, కర్కశంగా సాక్షాత్క రించింది. నిజం కాలేని కలలు! కొద్దిరోజుల క్రితం జరిగిన సంఘటన ఒకటి ఆమెకి జ్ఞాపకం వొచ్చింది. ఎవరో సంబంధం వాళ్ళు వొచ్చారు. అతనికి రెండో పెళ్ళి కావాలిట. మనిషికి నడివయసుకి కొంచెం తక్కువే ఉంటుందేమో. వాళ్లు వెళ్లిం తరువాత తండ్రి అడిగాడు, "ఏమమ్మా?" అని, ఆ స్వరం! తను కళ్లెత్తి తండ్రివైపు చూడగానే తల పక్కకి తిప్పు కున్నాడు. అంతే, ఇహ తను ఏమీ ఆలోచించలేదు. "సరే", అంది. ఆయన మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఆయన నుంచున్న స్థానంలోని కన్నీటి బిందువులు తన మనోఫలకం మీద ఎప్పుడూ ఆరిపోవు. దేవుడు తనపక్షం ఉన్నాడు, తన పురాకృత పుణ్యంవల్ల ఆ సంబంధం తప్పిపోయింది. "మరీ కూటికిలేనివాళ్ళపిల్లని చూస్తూచూస్తూ ఎలా చేసుకోను?" అన్నాట్ట వరుడు. శతసహస్ర వందనాలు!

దీపాలు వెలిగాయి. వసుంధర మళ్ళీ అరుగుమీద కూచుంది. ఆలోచనాప్రవాహం పల్లమెరిగి ప్రవహిస్తోంది.

తను గొప్ప అందకత్తె కాకపోయినా అందగత్తే అని నలుగురూ పొగడటం తనకి తెలియకపోలేదు. దానికితోడు సరైన విద్య ఉంటే...ధనంలేని లోపం తీరుతుంది. విద్యావతికి డబ్బు లేకపోయినా ఆదరం ఉంటుంది. తను ఎలాగో కష్టపడి బి. ఏ., చదివితే...బి. ఏ., చదువుతూంటే...

"మిస్ వసుంధరా."

పిలిచిందెవరో తనకి తెలుసు. తనంత అమాయకురాలు కాదు. ఆమె ఆగింది.

"ఏంకావాలి ?"

అతడు తొట్రుపడుతున్నాడు. వసుంధర నవ్వింది. ఎందుకంత గాభరా ?

"నేను మన డ్రమెటిక్ అసోసియేషన్ సెక్రెటరీని", తన కామాత్రం తెలుసు.

"మీరు నాటకంలో వేషం వెయ్యటానికి ఒప్పుకుంటారని ఆశిస్తున్నాను."

కొంచెం తటపటాయించాలి.

అతడు బతిమాలుతున్నాడు. ఇష్టం లేనట్టుగా "సరే", అంది...నాటకంలో వేసింది.

"గొప్పగా వేశారు."

అంతా అలాగే అంటున్నారని తనకి తెలియకపోలేదు.

"మిస్ వసుంధరా."

చిన్నగా నవ్వుకుందామె.

"ఒక విషయం చెప్పనా ?"

అదేమిటో తనకి తెలుసు. కిన్నెర స్వరంతో, వీణ మీటినట్టుగా అంది. "ఊఁ"...

"నేను... నేను... ప్రేమిస్తున్నాను."

"ఎవర్ని ? తమాషాగా, ఏమీ తెలియనట్టుగా అంది.

"మిస్ వసుంధరా..."

బాధపడుతున్నాడు. భయపడుతున్నాడు.

"తెలీదా ?" ఏడిపిస్తోంది కావాలని.

అతను చిరునవ్వుతో తన కళ్ళలోకి చూశాడు.

"నాకు డబ్బులేదు."

"అక్కర్లేదు", భర్తృహరి పద్యం చదివాడు, విద్యను గురించి.

ఆమె అరమోడ్పు కన్నులతో ఆలకిస్తోంది.

దభాలున కిటికీ తలుపులు కొట్టుకున్నాయి. దీపాలు ఆరిపోయాయి. చెదిరిన మనసుతో వసుంధర లేచి దీపాల దగ్గరికి వెళ్ళింది. కల నెమరువేసుకుంటోంది. ఎందుకీ అసంభవమైన ఆశలు! బి. ఏ, ఎలా చదువుతుంది తను ? ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష ఫీజు ఇంతవరకు కట్టలేదు. కట్టే ఆశ కూడా అంతగా లేదనే అనాలి. ముకుళించిన ముఖంతో వసుంధర దీపాలు వెలిగించి మళ్ళీ అరుగుమీద కూచుంది.

గాలికి తేలిపోయే మేఘాల్లా ఆలోచనలు మళ్ళీ మానసాకాశంలో తేలిపోతున్నాయి.

వనంలో పువ్వులు కోసుకుంటూ, చెట్టు చెట్టు దగ్గరికి వయ్యారంగా హంసనడకలతో పరిగెత్తుతూ ప్రేమగీతం – వసంతకాలంలోని కోయిలలా వసంతాగమనాన్ని సూచించే ప్రేమగీతం పాడుకుంటోంది. గభాలున ఆగిపోయింది. ఎవరతడు ? ఎంత ధైర్యం ? చరణం అందుకున్నాడు...కాని బాగానే పాడుతున్నాడు. చేతులో పిట్టల్ని కొట్టే తుపాకీ ఉంది. విద్యాధికుడులా ఉన్నాడు.

"ఎవరు మీరు ?" కోపం నటిస్తూ అంది.

"నువ్వెవరు ?"

అతనివైపు చురచుర చూసింది. అతడు నవ్వుతున్నాడు. కోపంతో గిరుక్కున తిరిగింది.

"ఆగు".

వెనక్కి తిరిగింది అప్రయత్నంగా. తుపాకి బారు చేశాడు. ముచ్చెమటలు పోశాయి. తటాలున తుపాకి కింద పారేసి అతడు ఏమాత్రం సంకోచం లేకుండా దగ్గరగా వొచ్చి అన్నాడు.

"ఎందుకంత భయం ?"

మాటి తమాషాగా తిప్పింది. ఏదో పాడాడతను. తన కోపం తమాషాగా పోయింది. కోపం నటిస్తూనే ఉంది.

"కోపమా ?" అతడు చుబుకాన్ని పట్టుకొని తనవైపు ముఖం తిప్పుకున్నాడు...

హృదయం అనురాగంతో నిండింది.

"నా జీవనరాణీ !"

తను అనర్హ్వాలనీ, దరిద్రులకీ, ధనవంతులకీ చుట్టరికం కూడదనీ ఏవేవో అంది.

"నీముందు ధనం నాకు గడ్డితో సమానం", అతడు మోకరిస్తున్నాడు–పవిత్ర ప్రేమికుడు.

రంయి మని గాలి వీచింది. జోరుగా తలుపులు తట తట కొట్టుకున్నాయి. ప్రమిదల్లో దీపాలు ఆరిపోయాయి. వసుంధర శూన్యంగా చూసింది. మళ్ళీ మామూలు ప్రపంచంలోకి తప్పనిసరిగా వొచ్చింది. అవన్నీ సినిమాల్లో జరిగే కథలూ, పుస్తకాల్లో రాసేవీ, పనిలేని రసికులు ఉబుసుపోకకి రాసుకునేవీ. ఆ ఆదర్శవంతు డెవరో మారుమూల ఉన్న తనని వెదుక్కుంటూ వొస్తాడా! నిస్పృహగా, యాంత్రికంగా వసుంధర దీపాలు వెలిగించింది.

పగలెక్కడెక్కడ తిరిగినా రాత్రికి గూటికి చేరుకునే విహంగాల్లా, ఆమె మనసు ఏవే విషయాలమీదికి తిరిగినా అసలు విషయానికే మళ్ళీ త్వరలో మరలింది.

ఎక్కడ చూసినా వీరేశలింగాలూ, అప్పారావులూ. భువనం కోలాహలంతో మారుమోగింది. "చిరకాలం జరిగిన", అన్యాయాలు ఇహ జరగవు. యువకులు నడుం కట్టారు. ముందుకు ఉరుకుతున్నారు. జనం సౌఖ్యం ఇహ మీదట ధనంమీద ఆధారపడదు. తను కోరిన కోరికలు, కలలు నిజంకాగల తరుణం...

టపటపమని తలుపులు కొట్టుకున్నాయి. గాలి హోరున వీస్తోంది. దీపాలు ఆరిపోయాయి. వసుంధర మరో

ప్రపంచంనుంచి మనుషుల ప్రస్తుత ప్రపంచంలోకి బలవంతాన విసరివేయబడ్డది. అరుగుమీదినుంచి లేచి దీపాల దగ్గరికి నడిచింది బరువుగా.

"ఎందుకు తల్లీ వృథా శ్రమ? గాలిలో దీపాలు వెలుగుతాయా?"

కూతురి వ్యర్థప్రయత్నాల్ని గుమ్మం దగ్గర కూచుని చూస్తున్న తండ్రి లాలనగా అన్నాడు. వసుంధర శూన్యంగా తండ్రి ముఖంలోకి చూసింది విషణ్ణవదనంతో.

అవును. గాలిలో దీపాలు వెలుగుతాయా? తను వొఠ్ఠి పిచ్చిది. దారిద్ర్యపు పెనుతుపానులో ఆశాజ్యోతులు అస్తిత్వానికి ఎంతకాలం గిజగిజ కొట్టుకోగలవు!

పదహారేళ్ళ ముగ్ధ, సుకుమారి, అమాయిక వసుంధర చెంపలమీద కన్నీటి బిందువులు జారాయి. కాటుక కన్నీళ్లు విషాదగీతం ఆలపిస్తూ మూనసందేశం ఏదో అందిస్తూ బరువుగా వసుంధరలో అదృశ్యమయాయి. ఆ ఇంటి వాకిట ప్రమిదల్లో దీపాలు ఆరాత్రి ఇహ మళ్ళీ వెలగలేదు.